ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

రెవెన్యూ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ స్థలాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ సాయిరామ్, సికింద్రాబాద్, తిరుమలగిరి, మారేడుపల్లి తహసీల్దార్లు పాండు నాయక్, అశోక్ కుమార్, భీమయ్యగౌడ్, ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతికి అవకాశం లేకుండా పౌరసేవలు అందించాలన్నారు. మహిళా శక్తి భవన్, నాయీ బ్రాహ్మణులతో పాటు ఇతర కుల సంఘాల భవనాలకు స్థలాల కేటాయింపుపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ కోర్టుల్లో ఉన్న కేసులపై సమీక్షలు నిర్వహించి ఆ కేసుల లో తీర్పులు సానుకూలంగా వచ్చేలా ప్రయత్నించాలని చెప్పారు. డిసెంబర్ 14వ తేదీలోపు మారేడుపల్లి, మడ్‌ఫోర్ట్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

‘గాంధీ’ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గాంధీఆస్పత్రి: ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వద్ద శుక్రవారం ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని నిర్వహించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. పలువురు చిరువ్యాపారులు తోపుడుబండ్లు, పాన్, టిఫిన్ డబ్బాలను ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేయడంతో రోగులు, రోగి సహాయకులతోపాటు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధాన రహదారిని ఆక్రమించడంతో అంబులెన్స్‌ల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐలు కరుణాకర్, నాగిరెడ్డి, పలువురు ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన కేసీఆర్

లాలాపేట: మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ చరిత్రలో మలుపు తిప్పిన రోజు అని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆలకుంట హరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి తార్నాక నుంచి దాదాపు 300 మంది బైక్‌లతో ఆలకుంట హరి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు ర్యాలీగా బయలుదేరారు. బీఆర్‌ఎస్ నాయకులు సునీల్ ముదిరాజ్, శివ, స్టాలీన్ కృష్ణవేణి, ఓర్సు శేఖర్, శంకర్ తదితరులున్నారు.



ఉత్సాహంగా ‘యువఫ్లేర్–24’



సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో ‘యువఫ్లేర్–24’ వార్షిక ఫెస్ట్ విద్యార్థినుల్లోని సృజనను వెలికితీసింది. జంట నగరాల్లోని 20 కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభను కనబరిచి అబ్బురపరిచారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రఖ్యాత భారతీయ ర్యాపర్, పాటల రచయిత, నటుడు రోల్ రైడాగా పేరుగాంచిన రాహుల్‌కుమార్ వేల్పుల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా జోసెఫ్, వైస్ ప్రిన్సిపాల్ షిర్లీ , ఈవెంట్ కో–ఆర్డినేటర్లు మినీ, ఇందు భార్గవి, ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు స్వెట్టర్ల పంపిణీ

రసూల్‌పురా: తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పదకొండు రోజుల అమరణ నిరాహార దీక్షను కేసీఆర్ చేశారని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో క్రిశాంక్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు స్వెట్టర్ల పంపిణీ జేశారు. కార్యక్రమంలో వెంకట్ , సాంబ ఆశోక్. గురువయ్య, సందీప్, అనితా శోభ, సాయి. రాజు, మోని రఘు, ఫహీం, సంపత్, రిషి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో...

దీక్షా దివస్15వ దినోత్సవం సందర్భంగా కార్ఖానలోని ఆర్‌కే ఫౌండేషన్ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జేల నాగేష్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు మందులు, దుప్పట్లు, భోజనం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాహుల్, రావుల సతీష్, జంగిలి రాజు. వృద్ధాశ్రమం నిర్వాహకులు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ హట్స్‌లో వృద్ధులకు స్వెట్టర్లు పంపిణీ జేస్తున్న క్రిశాంక్



వృద్ధాశ్రమంలో భోజనం అందజేస్తున్న గజ్జేల నాగేష్

కంటోన్మెంట్ విలీనానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి, ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వల్లే ఇక్కడి ప్రధాన సమస్యలకు తగిన పరిష్కారం లభిస్తుందని ఆమెకు వివరించామన్నారు. కంటోన్మెంట్‌ల విలీనానికి సంబంధించి వచ్చే నెల 4న కేంద్ర రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శితో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించిన అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. విలీనంపై కచ్చితమైన రూట్‌మ్యాప్‌ను వెల్లడించాల్సిందిగా రక్షణ శాఖ అధికారులను కోరాల్సిందిగా, సీఎస్‌కు విన్నవించామన్నారు. ఎమ్మెల్యేతో పాటు సీఎస్‌ను కలిసిన వారిలో కంటోన్మెంట్ వికాస్‌మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ ఉన్నారు.



సీఎస్ శాంతి కుమారితో భేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలం

మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్



మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

బంజారాహిల్స్: మాలలు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలుగుతామని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.4లోని గాంధీపురబస్తీలో ఏర్పాటు చేసిన బస్తీబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జనలో మాల సోదరులు వారి కుటుంబ సభ్యులతో సహా పాల్గొని సత్తా చాటాలని కోరారు. సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పు వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు న్యాయం జరిగేంత వరకు ప్రతీ ఒక్కరు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి చెట్లపల్లి రాంచందర్, మాల సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగం అధ్యక్షులు చెట్లపల్లి అరుణ్ కుమార్, చెట్లపల్లి నర్సింగ్‌రావు, చెట్లపల్లి విజయ్‌కుమార్, శ్రీనివాస్, సాయికుమార్, పోతుల మధుసూదన్, శశికళ, యుగేందర్, రుక్మేష్ తదితరులు పాల్గొన్నారు.

తార్నాక జంక్షన్‌కు మళ్లీ గ్రహణం

- 2 నెలల వరకు పాత పద్ధతే..
- జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్ణయం

పునరుద్ధరణకు సాంకేతిక అడ్డంకులు



తార్నాక కూడలిలో ఎనిమిదేళ్ల క్రితం మూసివేసిన జంక్షన్

సికింద్రాబాద్: ఎనిమిదేళ్ల క్రితం మూసివేసిన తార్నాక జంక్షన్ పునరుద్ధరణ చర్యలకు తాత్కాలిక బ్రేక్ పడింది. డిసెంబర్1న తార్నాక జంక్షన్‌ను అందుబాటులోకి తేవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ స్థానికంగా భూ యాజమాన్య సమస్యలు అడ్డుగోడలుగా నిలువడంతో మరికొంతకాలం పాత పద్ధతిలో ‘యూ’ టర్న్‌లను కొనసాగించి ఆ మార్గాల మీదుగా వాహనాల రాకపోకలను కొనసాగించాలని అధికారులు శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. తార్నాక కూడలి మీదుగా ఫ్లై ఓవర్ ఉంది. ఇక్కడి జంక్షన్‌ను మూసివేసి రెండు వైపులా ‘యూ’ టర్న్‌లు ఏర్పాటు చేశారు. ఫ్లై ఓవర్ ఎక్కి దిగే వాహనాలు వేగంగా వెళుతుండడం, వాటికి సమీపంలోనే ‘యూ’ టర్న్‌లు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా పలువురు మృత్యువాత పడ్డారు. ఉదయం, సాయంత్రం కార్యాలయాల సమయంలో సమస్యలు మరింత జటిలం అవుతున్నాయి. ప్రమాదాల నివారణకు తార్నాక కూడలిని విస్తరణ, ఆధునీకరణ పనులు పూర్తి చేసి జంక్షన్‌ను పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం కోసం రూ.40 లక్షలు కేటాయించారు. కూడలి నుంచి సెయింట్ ఆన్స్‌రోడ్‌లోని రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. మరో నాలుగు భవనాలను పాక్షికంగా తొగించారు. కూడలిలోని ఒక పెట్రోలు బంకు స్థలం, మరోవైపున్న ఓయూ స్థలం స్వాధీనం చేసుకుని పని పూర్తి చేద్దామని అధికారులు భావించారు. కాగా ఈ రెండు పనులతోనే అసలు సమస్యలు ఎదురయ్యాయి.

భూ సమస్యలు ఇవీ!

2009 కాలంలో తార్నాక రహదారి విస్తరణ జరిగింది. ఆసమయంలో కూడలిలోని ఒక పెట్రోలు బంకుకు చెందిన 6600 చదరపు అడుగుల స్థలాన్ని జీహెచ్‌ఎంసీ సేకరించింది. అదే సమయంలో ప్రభుత్వ విలువ ప్రకారం బంకు యజమానికి నష్టపరిహారం కింద డబ్బు చెల్లించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు నష్ట పరిహారం డబ్బు నేటికీ అధికారులు బంకు యజమానికి చెల్లించలేదు. తాజాగా రహదారి విస్తరణ పనులు చేపట్టి కూడలిలో ‘ఫ్రీ’ లెఫ్ట్ పనులు ఏర్పాటు చేసేసమయంలో బంకు యాజమాన్యం అభ్యంతరం చెప్పడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయి.

- మరోవైపు ఓయూ రోడ్డును కొంతమేర విస్తరించి ట్రాఫిక్ ఐల్యాండ్, బస్‌బే, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేశారు.ఆ స్థలం ఉస్మానియా యూనివర్సిటీకి చెందినది కావడం గమనార్హం. యూనివర్సిటీ అధికారుల అనుమతి లేనిదే పనులు చేసేది లేదని కాంట్రాక్టరు చేతులు ఎత్తేయడంతో బస్‌బే, ఐలాండ్ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. పెట్రోలు బంకు స్థలం, యూనివర్సిటీ స్థలం స్వాధీనం చేసుకోనిదే మూసివేసిన జంక్షన్‌ను తెరువడం, వాహనాల రాకపోకలు పునరుద్ధరించడం సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.

చర్చలకు నిర్ణయం..

బంకు యజమాని, వర్సిటీ అధికారులతో చర్చలు జరిపి రెండు సాంకేతిక సమస్యలకు పరిష్కారం జరిపిన మీదట మాత్రమే జంక్షన్ పునరుద్దరణ పనులు కొనసాగించాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ అధికారులు నిర్ణయించారు. ఒకటి రెండు రోజుల్లో వర్సిటీ అధికారులను సంప్రదించి భూ బదలాయింపు, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా వర్సిటీ స్థలాన్ని సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు నష్టపరిహారం చెల్లింపు విషయంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. ఈ రెండు కార్యక్రమాలు పూర్తి చేసి జంక్షన్‌ను పునరుద్ధరించేందుకు ఒకటి, రెండు నెలలు పట్టే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.

సందడి చేసిన విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: వెస్ట్‌మారేడుపల్లి గీతాంజలి హైస్కూల్ విద్యార్థుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాయంత్రం పాఠశాల వార్షికోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. యుద్ధం వల్ల వచ్చే అనర్థాలను, సామాన్యులు పడుతున్న బాధలను కళ్లకు కట్టినట్లు నాటిక రూపంలో ప్రదర్శించి ప్రపంచ శాంతి ఆవశ్యకతను వివరించి ఆకట్టుకున్నారు. అలాగే వివిధ అంశాలపై నాటికలతో పాటు అద్భుతమైన డ్యాన్సులతో అందరినీ కట్టిపడేశారు. హెచ్‌ఎస్‌ఎస్‌సీ చైర్మన్ అమీర్‌ఖాన్, సోషల్ ఆక్టివిస్ట్ దమయంతి, స్కూల్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

తప్పు చేసిన వారిని ప్రభుత్వం వదలిపెట్టదు

రాంగోపాల్‌పేట్: తప్పు చేసిన వారు ఎంతటి వారైనా కాంగ్రెస్ ప్రభుత్వం వదలిపెట్టదని ఆ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. శుక్రవారం సుభాష్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్, శివకుమార్ లాల్, హేమంత్ సింగ్ ఠాకూర్, మల్లం రమేష్ తదితరులు మాట్లాడారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీలో తన కుమారుడు సాయి కిరణ్ యాదవ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రభుత్వం దగ్గర అన్ని ఆధారాలున్నాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని తప్పు చేసిన వారిని ప్రభుత్వం వదలిపెట్టదని హెచ్చరించారు.

పిల్లలు సోషల్ మీడియాను చూడకుండా నిషేధించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మన దేశంలో 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను చూడకుండా నిషేధించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల లింగంగౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాలకు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించారని తాజాగా ఆస్ట్రేలియా నిషేధించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పాఠశాల విద్యను ఆర్జించే వయస్సులో పిల్లలు సోషల్ మీడియా వలన చదవలేక పోతున్నారని ఆయన వివరించారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించినట్లు బీహెచ్‌పీఎస్ నేతలు శుక్రవారం తెలిపారు. అన్ని రంగాలలో వెనుకబడిన వాల్మీకి బోయల అభివృద్ధికి ఎస్టీ జాబితాలో చేర్చాలని గత ఐదు దశాబ్దాలుగా పోరాడుతున్నామని సీఎంను కోరినట్లు బోయ హక్కుల పోరాట సమితి యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు బోయ రమేష్ పేర్కొన్నారు.

18న కృతజ్ఞత సభకు అనుమతి కోరిన నేతలు

ఓయూలో విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబరు 18న జరిగే కృతజ్ఞత సభకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. సభకు యూనివర్సిటీ తరపున అనుమతి ఇవ్వాలని వీసీని కోరినట్లు జేఏసీ చైర్మన్ కోటూరి మానవత రాయ్ పేర్కొన్నారు.

ఆధారాలున్నా తలసాని బుకాయించడం సరికాదు

కాంగ్రెస్ నాయకులు

సనత్‌నగర్: ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు మంజూరు చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌ల రహస్య పొత్తు బయటపడిందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. బేగంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు విశాల్ సూదం ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమలో తలసాని కుమారుడు సాయికిరణ్ యాదవ్, ఇతర సభ్యులు డైరెక్టర్లుగా ఉన్నట్లు ఆధారాలు బయటపడినా తలసాని బుకాయిస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. పైగా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వమే అన్నీ చేసిందంటూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇథనాల్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కావడంలో కేటీఆర్ కీలక పాత్ర వహించారన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండీ అతీక్, ప్రతాప్‌నాయక్, ఖమర్ అహ్మద్, మునీర్‌ఖాన్, చిరంజీవి, కృష్ణ, మనోజ్, ఎండీ షర్ఫుద్దీన్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

చిలకలగూడ: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. సీతాఫల్‌మండి శ్రీచైతన్య హైస్కూలు ప్రాంగణంలో రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాంబాబు, ప్రిన్సిపాల్ షేక్‌అబ్దుల్‌నబీ, డీన్ కృష్ణ, జోనల్ కోఆర్డినేటర్ పావని పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలపై రోడ్డెక్కిన పీజీ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని న్యూగోదావరి హాస్టల్ పీజీ విద్యార్థులు రోడ్డెక్కారు. శుక్రవారం నాణ్యతలేని భోజనాలు పెడుతున్నారని వండిన వంటలతో హాస్టల్ నుంచి ఆర్ట్స్ కాలేజీ చేరుకొని రోడ్డు పైన బైఠాయించి ధర్నా చేపట్టారు. గత కొంత కాలగా వంటకాలు రుచించడం లేదని, నీళ్ల చారు, రుచిలేని కూరలతో నాణ్యత ప్రమాణాలు లేని భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోనందున ఆందోళన చేపట్టినట్లు తెలిపారు ఓయూ చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్‌రావు అక్కడకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం

అమీర్‌పేట: కాలనీలు,బస్తీల్లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపి వెంకటరమణ అన్నారు. ఎస్‌ఆర్‌నగర్ కాలనీ లైబ్రరీ పరిసరాల్లో 30 సీసీకెమెరాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కెమెరాలు పెట్టనున్న ప్రాంతాలను ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో స్థానికంగా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజల సహకారంతో అన్ని చోట్ల నిఘా వ్యవస్థను పెంచుతున్నట్లు చెప్పారు.



ఎస్‌ఆర్‌టీ కాలనీలో పర్యటిస్తున్న పోలీసు అధికారులు

ఉద్యమ గుర్తులు చెదరలేదు

ఓయూ దీక్షా దివస్‌లో బీఆర్‌ఎస్‌వీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమ గుర్తులు ఓయూలో ఇంకా చెదిరిపోలేదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తొట్లస్వామి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నాయకులు దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగబాలు అధ్యక్షత వహించగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యమ నేత తొట్లస్వామి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఓయూ విద్యార్థులు అనేక త్యాగాలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వతీరు మారకుంటే మరో ఉద్యమానికి వెనుకాడ బోమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు హెచ్చరించారు. కార్యక్రమంలో గుండగాని కిరణ్‌గౌడ్, కడారి స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తొట్ల స్వామియాదవ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: లాలాగూడ, మోండా మార్కెట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 30న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విజయపురి ఫీడర్ పరిధిలోని విజయపురి, చిల్డ్రన్స్‌పార్క్‌రోడ్, ఓయూ క్వార్టర్స్, వాటర్ వర్క్స్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు లాలాపేట్ ఫీడర్ పరిధిలోని వినోభానగర్, ఇందిరానగర్, లాలాపేట్, గణేష్ టెంపుల్, ఇసుకబావి ప్రాంతాల్లో
- ఉదయం 11గంటల నుంచి 11..30గంటల వరకు ధర్మకాంట ఫీడర్ పరిధిలోని మానస నర్సింగ్ హోం, టెలిఫోన్ భవన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా దీక్షా దివస్



తెలంగాణ చౌక్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దీక్షా దివస్ వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు

రసూల్‌పురా: అన్నానగర్ తెలంగాణ చౌక్ లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పూలదండలు వేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాయికిరణ్, చిన్నా, కనకయ్య . దర్శన్, వెంకటరాముడు. అశోక్. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసూల్‌పురా నుంచి తెలంగాణ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఓయూలో బంద్ కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్, అనారోగ్యం, విద్యార్థుల మరణాలతో పాటు ఇతర సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున బంద్ పాటించి నిరసన తెలపనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లెనిన్, ఆంజనేయులు తెలిపారు.

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి వర్సిటీ పాలనా భవనం వరకు భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఓయూలో పర్యటించాలని, విద్యార్థుల ఎజెండాను అసెంబ్లీలో చర్చించాలనే డిమాండ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్, స్వాతి పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఇన్స్‌పెక్టర్ రఘు బాబు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్వాహకులు పాటించాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘ విద్రోహ శక్తులను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు పోలీసులు నిరంతరం తమవంతు కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో ఇన్స్‌పెక్టర్ రఘుబాబు, ఎస్‌ఐలు షాహీద్ పాషా, నాగరాణి, కిషోర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కంటోన్మెంట్: మారేడుపల్లిలోని సుప్రసిద్ధ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం అభివృద్ధికి సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని కాలభైరవ విగ్రహ దాత సందీప్‌తో కలిసి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సనత్‌నగర్: కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్, శివశక్తి ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు 100 మందిని పరీక్షించి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని మందులను అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపీ వైద్యుడు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. బస్తీ కమిటీ సలహాదారులు యాదగిరి, మొగిలయ్య, అధ్యక్షుడు గిరిధర్, ప్రధాన కార్యదర్శి పి.కుమార్ పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి

బౌద్ధనగర్: దేవాలయాలు, మసీదులు, చర్చిలు, దర్గాలు అన్ని ప్రార్థనా మందిరాల వద్ద నిర్వాహకులు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారాసీగూడ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో కొంత మంది సమాజంలో అలజడి సృష్టించేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వాటిని నిరోధించడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ సైదులు, ఎస్సైలు సుధాకర్, మల్లికార్జున్, సునిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాణి తెలిపిన మేరకు.. శాంతినగర్ ప్రాంతానికి చెందిన విక్టర్ జోసెఫ్(48) కొద్ది రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల ఒకటిన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఇది వరకు కూడా ఒకసారి ఇంటి నుంచి వెళ్లి పది రోజుల తరువాత తిరిగొచ్చాడు. కానీ రోజులు గడుస్తున్నా జోసెఫ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.